# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించటంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యువ వైద్యులకు సూచించారు.
- ❖ ఎయిమ్స్ అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ నూతన పర్యాటక పాలసీ 2024-2029ని మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు ఆవిష్కరించారు.
- ❖ రెవెన్యూ రికార్డులన్నింటిని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తామని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.
- ❖ జనవరి నెలాఖరు లోగా చేప పిల్లల పంపిణీ పూర్తి చేయాలని మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

======================

భారతీయ సాంప్రదాయ వైద్యంతో ఆధునిక విద్యను సమన్వయపరుచుకుంటూ అత్యుత్తమ సేవలందించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వైద్య విద్యార్థులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) మొదటి స్నాతకోత్సవంలో ఈ రోజు రాష్ట్రపతి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎయిమ్స్ మంగళగిరి ప్రాంగణంలోని ఆడిటోరియంలో జరిగిన ఈ స్నాతకోత్సవంలో MBBS పూర్తి చేసిన మొదటి బ్యాచ్ 48 మంది విద్యార్థులకు ద్రౌపది ముర్ము పట్టాలను ప్రధానం చేశారు. అనంతరం ప్రసంగిస్తూ... వైద్య వృత్తిలో మొదటి అంకాన్ని పూర్తి చేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులు సేవాభావన, నిరంతర శిక్షణ, పరిశోధన అనే మూడు అంశాలతో ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. “అందరికీ ఆరోగ్య సంరక్షణ” అనే నినాదంతో పని చేయాలని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించటంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్రపతి విద్యార్థులకు సూచిస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాధవ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్ లు పాల్గొన్నారు.

=====================

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) అభివృద్ధికి కావలసిన నీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధమ ప్రాధాన్యత నిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఎయిమ్స్ స్నాతకోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... ఇప్పటికే ఎయిమ్స్ నిర్మాణం కోసం 83.11 ఎకరాలు కేటాయించామని, కోలనుకోండలో ఎయిమ్స్ రీసెర్చి బ్లాకు వద్ద స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఏర్పాటు కోసం మరో 10 ఎకరాలు కావాలని ఎయిమ్స్ చేసిన విజ్ఞప్తి మేరకు వెంటనే ఆ స్థలాన్ని కేటాయిస్తామని సభాముఖంగా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. రాజధాని అమరావతిని రానున్న మూడు సంవత్సరాల్లో 50 వేల కోట్ల రూపాయలతో అధునాతనంగా తీర్చిదిద్దనున్నామని, దాంతో పాటూ ఎయిమ్స్ మంగళగిరి కూడా దేశంలో ప్రధమ స్థానానికి చేరుకోవాలాని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

కాగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా 2015 డిసెంబర్ 19న అప్పటి కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి జె.పి.నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళగిరిలో ఎయిమ్స్ కు శంఖుస్థాపన చేశారు. 2019 మార్చి 12 నుండి ఎయిమ్స్ ప్రజలకు ఔట్ పేషంట్ సేవలను ప్రారంభించగా, 2020 జులై 11 నుండి ఇన్ పేషంట్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.

=====================

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు నూతన పర్యాటక పాలసీ 2024-2029ను ఆవిష్కరించారు. సీఐఐ, ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన నూతన పాలసీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెట్టుబడులు పెట్టేందుకు ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని, ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. పర్యాటక రంగంలో తమది సమగ్ర విధానమని పేర్కొంటూ... రాష్ట్రంలో విశాలమైన సముద్రతీరం, అద్భుతమైన చారిత్రక, వారసత్వ, ప్రకృతి సంపద, సజీవ నదులు ఉన్నాయని చెప్పారు. పీపీపీ విధానంలో 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు.

=====================

రెవెన్యూ రికార్డులన్నింటిని పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఈరోజు ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, ఆర్డీవోలతో ప్రాంతీయ రెవెన్యూ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ ఆధారంగా రికార్డులు తయారు చేసి పెట్టుకోవాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరించిన తర్వాతనే రీ సర్వేపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

విరామం

=====================

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు ఈరోజు సచివాలయంలో పశుసంవర్థక, మత్స్య శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ల ఆధ్వర్యంలో జనవరి నెలాఖరు లోగా చేప పిల్లల పంపిణీ పూర్తి చేయాలనిఈ సందర్భంగా ఆదేశించారు. రాష్ట్రంలో తీర ప్రాంత అభివృద్ధికి నివేదిక సిద్ధం చేయాలని, మత్స్యకారుల పడవలకు ఇంధన రాయితీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎంబ్రియో ట్రాన్స్పర్ టెక్నాలజీ అభివృద్ధి పరచి, మేలైన పశు జాతుల ఉత్పత్తిని ప్రోత్సహించాలన్నారు. అలాగే.... పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

======================

"ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం"పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్ అధికారులను ఆదేశించారు. పి.ఎమ్. సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుపై ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో డీఎల్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పీఎం సూర్య ఘర్ పథకాన్ని ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని, ఒక సంవత్సర కాలంలో కోటి గృహాలు ఈ పథకం పరిధిలోకి తీసుకు రావాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో 30 లక్షల గృహాల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

======================

రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వందల సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖాల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... భూముల ఆక్రమణ, రీ సర్వేలో అవకతవకలపైనే ఎక్కువగా వినతులు వస్తున్నాయన్నారు. రెవెన్యూ సమస్యలను సమూలంగా పరిష్కరించాలనే ఈ సదస్సులను ఏర్పాటు చేశామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

======================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టిన స్టెల్లా ఎల్ పనామా నౌకలో మొత్తం ఒక వెయ్యి 320 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం గుర్తించామని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... నౌకలోని మూడవ కంపార్ట్మెంట్ లో పిడిఎస్ బియ్యం గుర్తించామన్నారు. వాటిని బయటకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లాలోని 137 రైస్ మిల్లులకు సంబంధించి 13 కేసులు పెట్టడం జరిగిందని, వీటిలో 75 మిల్లులను తనిఖీ చేయడం పూర్తయిందని ఎస్పీ వెల్లడించారు.

======================

విజయనగరం జిల్లాలో మొట్టమొదటి సారిగా పిండ గర్భధారణ ప్రక్రియ ద్వారా గిర్ జాతి ఆవుదూడ జన్మించింది. రామభద్రపురం మండలం జగన్నాథపురం గ్రామంలో ఈ సంవత్సరం మార్చి 9వ తేదీన గిర్ జాతి ఆవు పిండాన్ని... ఒక సంకర జాతి ఆవులో ప్రవేశ పెట్టగా... రెండు రోజుల క్రితం ఆ ఆవు ఆరోగ్య వంతమైన ఆడ పెయ్యకు జన్మనిచ్చిందని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వై.వీ.రమణ తెలిపారు. సాధారణంగా ఆవు... జీవిత కాలంలో 8 నుండి నుంచి 10 దూడలకు మాత్రమే జన్మనిస్తాయని... ఎంబ్రియో ట్రాన్స్ఫర్ విధానం ద్వారా ఒక ఆవు నుండి 150 పిండాల వరకు సేకరించి... సుమారు 50 నుంచి 60 దూడలను పొందవచ్చని ఆయన వివరించారు.

======================

======================